

రీసర్వేపై రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి

ఆర్‌డిఒ దాసి రాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

రీసర్వే నిమిత్తం రైతులకు ముందస్తు సమాచారం అందించాలని ఆర్‌డిఒ దాసి రాజు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కెపిపాలెంలో రీసర్వే నిర్వహిస్తున్న సిబ్బందితో ఆయన మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసి రాజు రైతులకు నోటీసులు అందిస్తున్నారా, లేదా అని ఆరా తీశారు. రైతులకు సమాచారం అందించిన అనంతరం రీసర్వే నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ కె.రాజకిషోర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



సిబ్బందితో సమీక్షిస్తున్న ఆర్‌డిఒ

చంద్రన్న బీమా ఇచ్చేదుండా..!

ఏడాది పూర్తవుతున్నా అతీగతీ లేని పథకం అమలు

ఎన్నో కుటుంబాలు ఇంటి పెద్దదిక్కును కోల్పోయి అవస్థలు

రెండు జిల్లాల్లో దాదాపు మూడు వేలకుపైగా బాధిత కుటుంబాల ఎదురుచూపు

ప్రమాద బీమా రూ.పది లక్షలు, సాధారణ మరణాలకు రూ.5 లక్షలు ఇస్తామని హామీ

కూటమి ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం హామీల అమలులో తీవ్ర నిర్లిప్తత ప్రదర్శిస్తూ విమర్శలు ఎదుర్కొంటుంది. అధికారంలోకొచ్చి ఏడాది గడిచిపోతున్నా ప్రజలకు అత్యంత అవసరమైన పథకాలను సైతం అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న పరిస్థితి ఉంది. దీంతో హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమమైందనే చర్చ జనాల్లో పెద్దఎత్తున సాగుతోంది. పేదలకు అత్యంత అవసరమైన పథకాల్లో చంద్రన్న బీమా ఒకటి. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో ఈ పథకం అమల్లోకి వచ్చింది. తర్వాత వైసిపి ప్రభుత్వం వైఎస్ఆర్ బీమా పేరుతో ఈ పథకాన్ని కొనసాగించింది. కుటుంబ పెద్ద చనిపోతే ఆ కుటుంబానికి రక్షగా ఉండేందుకు ఈ బీమా పథకాన్ని తీసుకొచ్చారు. 50 ఏళ్లలోపు ఉన్న ఇంటిపెద్ద సాధారణంగా మృతి చెందితే రూ.లక్ష, ప్రమాదంలో మరణిస్తే రూ.ఐదు లక్షలు చొప్పున వైసిపి ప్రభుత్వంలో అందించేవారు. తాము అధికారంలోకి వస్తే చంద్రన్న బీమా పథకం అమలు చేస్తామని, సాధారణ మరణానికి రూ.ఐదు లక్షలు, ప్రమాద మరణానికి రూ.పది లక్షలు ఇస్తామని కూటమి మేనిఫెస్టోలో పెట్టింది. కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలకు బీమా అండగా ఉంటుందని అంతా భావించారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా పథకం మాత్రం అమలు చేయలేదు. దీంతో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన వేలాది కుటుంబాలు చంద్రన్న బీమా ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్నాయి. ఆర్థిక చేయూత లేక ఆ కుటుంబంలోని పిల్లలు చదువు వదిలేసి కూలి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పేదలకు ఆర్థిక అండగా నిలిచే బీమా పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చంద్రన్న బీమా ఇచ్చేదుండా అంటూ అంతా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

వేలాది కుటుంబాలు ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు


ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఏడాదికి దాదాపుగా మూడు వేలకుపైగా మరణాలు బీమా పరిధిలోకి వస్తున్నాయి. గత ప్రభుత్వంలో బీమా సొమ్ము అందించిన వివరాలను పరిశీలిస్తే ఇది తేటతెల్లమవుతోంది. 2021-22లో ఏలూరు జిల్లాలో సాధారణ మరణాలు 1,692, ప్రమాద మరణాలు 215 ఉన్నాయి. వైఎస్ఆర్ బీమా కింద 1,550 కుటుంబాలకు సొమ్ములు అందాయి. 2022-23లో సాధారణ మరణాలు 1,467 ఉండగా, ప్రమాద మృతులు 181గా నమోదయ్యాయి. 1,610 కుటుంబాలు బీమా సొమ్ము అందుకున్నాయి. 2023-24లో సాధారణ మరణాలు 1,492 ఉండగా, ప్రమాద మరణాలు 196 ఉన్నాయి. బీమా సొమ్ము అందుకున్న కుటుంబాలు 1,149 ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ లెక్కల ప్రకారం చూస్తే రెండు జిల్లాల్లో దాదాపుగా బీమా అందుకున్న కుటుంబాలు ఏడాదికి మూడు వేల వరకూ ఉన్నట్లు తెలుస్తోంది. నెలకు 250 మంది వరకూ సాధారణ, ప్రమాద మరణాలు నమోదవుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. 2024 మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత బీమా సొమ్ము బాధిత కుటుంబాలకు అందలేదు. 14 నెలలుగా బీమా సొమ్ము ఏఒక్క కుటుంబానికీ అందని పరిస్థితి. దాదాపుగా మూడు వేలకు పైగా బాధిత కుటుంబాలు చంద్రన్న బీమాకోసం ఎదురుచూస్తున్నాయి.

చంద్రన్న బీమాకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎటువంటి విధివిధానాలు విడుదల చేయలేదు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం కుటుంబంలోని 18 ఏళ్లు దాటిన వారు ఎవరు మరణించినా చంద్రన్న బీమా వర్తించేలా నిబంధనలు ఉండేవి. వైసిపి ప్రభుత్వం రేషన్‌కార్డులో ఉన్న ఇంటిపెద్దను మాత్రమే వైఎస్ఆర్ బీమా పరిధిలోకి తెస్తూ నిబంధనలు మార్చింది. అంతేకాకుండా బీమా సొమ్ము సైతం వైసిపి ప్రభుత్వం తగ్గించింది. కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమా ఏవిధంగా అమలు చేయనుందో ఇప్పటి వరకూ విధివిధానాలు ప్రకటించలేదు. ఇంటి పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబీకులు చంద్రన్న బీమా కోసం గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తిరుగుతూ అలసిపోతున్న పరిస్థితి ఉంది. బీమా సొమ్ము అందిస్తే ఎన్నో పేద కుటుంబాలకు ఊరట కలగనుంది. ప్రభుత్వం వెంటనే చంద్రన్న బీమా అమలు చేయాలని జనం కోరుతున్నారు.

ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

రైతుల వద్ద ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి సొమ్ము చెల్లించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానికసబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాలు, రైస్‌మిల్లర్లు టార్గెట్ పూర్తయ్యిందని, ధాన్యం కొనుగోలు చేయలేమని చెబుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. అకాల వర్షాల వల్ల తేమశాతం పెరిగి రైతులు ఇప్పటికే నష్టపోయారన్నారు. టార్గెట్ల పేరుతో ధాన్యం కొనుగోలు ఆపేస్తే రైతులు మరింత నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. టార్గెట్లతో సంబంధం లేకుండా, తేమ శాతంతో నిమిత్తం లేకుండా రైతుల నుండి ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా 24 గంటల్లో సొమ్ము చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, మిల్లర్ల దోపిడీని అరికట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి సిహెచ్.పెద్దిరాజుకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, నేతలు తెలగంశెట్టి సత్యనారాయణ, గుత్తుల శ్రీరామచంద్రుడు, కౌరు శ్రీనివాస్, గుబ్బల నాగేశ్వరరావు, తిరుమాని సత్యనారాయణ, దొంగ భాస్కరరావు, దిడ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.




ధర్నాలో నినదిస్తున్న నేతలు, రైతులు

కొనసాగిన సిహెచ్‌ఒల సమ్మె

సంఘీభావం తెలిపిన ఆశా వర్కర్లు

ప్రజాశక్తి - భీమవరం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్తాఫీసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 16వ రోజుకు చేరుకుంది. స్థానిక కలెక్టరేట్ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సమ్మె శిబిరాన్ని కొనసాగించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమ్మెకు ఆశా వర్కర్లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ 16 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కనీసం చర్చలకు పిలిచి సమస్యలను అడిగి తెలుసుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ వారు చేపట్టే ఆందోళనకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న ఆశాలు

సిహెచ్‌ఒలను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపాలన్, రాయ్

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులుగా నిరవధిక సమ్మెలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్) అసోసియేషన్ ఎపి ఎంసిఎ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా సిహెచ్‌ఒలు పోరాడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్లు వద్ద మండుటెండలో నిరసన తెలియజేస్తున్నా ప్రభుత్వం, మంత్రులు, అధికారులు పట్టించుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని, జాబ్‌చార్ట్ రూపొందించాలని, బకాయిలు లేకుండా వేతనాలు, అద్దె చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ చట్టాలను అమలు చేయాల్సిన మంత్రి తాము రూపొందించిన చట్టాలను అవహేళన చేస్తూ 'మీ వల్ల ఉపయోగం లేదు.. తొలగిస్తే రూ.500 కోట్లు మిగులుతుంది' అని బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యానించడం సరికాదని ఖండించారు. చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని కోరడమే వారు చేసిన నేరమా అని ప్రశ్నించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయ పోరాటానికి సిఐటియు మద్దతు ప్రకటించిందని, ప్రభుత్వం పట్టించుకోకుంటే వారికి మద్దతుగా జిల్లావ్యాప్తంగా కార్మికవర్గాన్ని సమీకరించి పోరాటాన్ని ఉధృతం చేస్తామని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని సంఘ ప్రతినిధులను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలు వినియోగించుకోవాలి

9552300009 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను 9552300009 ద్వారా పొందవచ్చునని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతుల మీదుగా 'మనమిత్ర' స్టాండ్‌లను మండలాలవారీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వ ధ్రువపత్రాలన్నీ వాట్సాప్ ద్వారానే ప్రజలు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం మనమిత్రను అందుబాటులో తీసుకొచ్చిందన్నారు. తొలి విడత పెద్ద మొత్తంలో సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు రాకుండానే మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దేవాదాయ, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల్లో చెల్లింపులు, జనన, మరణాల ధ్రువీకరణ పత్రాలు, ట్రేడ్ లైసెన్సులు, వివిధ రకాల ధ్రువపత్రాల జారీ సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, వివిధ మండలాల ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయాల సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



స్టాండ్‌లను అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

సిపిఎం సేవలు అభినందనీయం

మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

సమాజానికి సిపిఎం అందిస్తున్న సేవలు అభినందనీయమని భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. సిపిఎం మంచి సేవాకార్యక్రమాలకు చేపడుతుందని ప్రశంసించారు. దీనిని భవిష్యత్తులో కొనసాగించాలని సూచించారు. సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య కుల, మతాలకు అతీతంగా ప్రజానీకానికి విశేష సేవలందించారన్నారు. ఆయన పేరున సిపిఎం వేసవిలో దాతల సహకారంతో అనేకచోట్ల చలివేంద్రాలు నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ సిపిఎం ఏ సేవా కార్యక్రమం ప్రారంభించినా దాతల సహకారంతోనే చేస్తోందన్నారు. 15 రోజులపాటు చలివేంద్రం నిర్వహణకు ముందుకొచ్చిన దాత కొత్త రాధాకృష్ణమూర్తి, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. చలివేంద్రం నిర్వహణకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, నేతలు ఎం.వైకుంఠరావు, త్రిమూర్తులు, కె.రత్నకుమారి పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

కాల్వల ప్రక్షాళనకు ఆక్వా రైతులు సహకరించాలి

గృహ వినియోగ, ఆక్వా వ్యర్థ జలాలు పంట కాల్వల్లోకి వదిలితే చర్యలు

డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - ఉండి


పంట, మురుగునీటి కాలవల ప్రక్షాళనకు చర్యలు చేపట్టామని, దీనికి ప్రజలు, ఆక్వా రైతులు సహకరించాలని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ తోట ఫణిబాబు నేతృత్వాన ఈ ప్రక్షాళన పనులు చేపడుతున్నట్లు వివరించారు. మంగళవారం స్థానిక నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కాల్వల ప్రక్షాళన లేక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్వచ్ఛమైన తాగునీరు, సాగునీరు అందించాలనే లక్ష్యంతో కాలువల ప్రక్షాళన చేపట్టామన్నారు. కొంతమంది వ్యక్తులు కాల్వగట్లను ఆక్రమించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, షెడ్లు ఏర్పాటు చేశారని, వాటిని స్వచ్ఛందంగా తొలగిస్తే మంచిదని, లేనిపక్షంలో అధికారులు తొలగిస్తారని తెలిపారు. ఆక్వా రైతులు, కాల్వ గట్ల వెంబడి ఉన్న ఇళ్ల ప్రజలు వ్యర్థ జలాలను పంట కాల్వల్లోకి వదులుతున్నారని, ఇకనైనా ఇటువంటి చర్యలు మానుకుని అధికారులకు సహకరించాలని అన్నారు. లేనిపక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నీటి కాలుష్యం వల్ల ప్రజలు కేన్సర్, ఊపిరితిత్తుల సమస్యలు తదితర రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కాల్వల ప్రక్షాళనకు సహకరించని వారు సమాజ ద్రోహులుగా మిగిలిపోతారన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ తోట ఫణిబాబు, వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు, టిడిపి నేతలు కొత్తపల్లి నాగరాజు, కన్నెగంటి రూత్‌కళ, జనసేన నేతలు యడవల్లి వెంకటేశ్వరరావు, కమతం బెనర్జీ, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, ఉండి పంచాయతీ కార్యదర్శి అనిల్, నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

17న అంబేద్కర్ జీవితంపై కళారూప ప్రదర్శన

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 17వ తేదీన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జీవిత చరిత్రపై కళారూప ప్రదర్శన (నాటకం)ను జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు పిలుపునిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జీవిత చరిత్రపై నాటక ప్రదర్శన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ సమాజమే తన కుటుంబంగా భావించి, అట్టడుగు వర్గాల బతుకుల భద్రత కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ప్రపంచ మేధావిగా, నవభారత రాజ్యాంగ నిర్మాతగా చరిత్రకెక్కిన మేధావి అంబేద్కర్ అని అన్నారు. అంబేద్కర్ భావజాలం నేటి యువతరానికి ఎంతో అవసరమన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకొని కెవిపిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాలను చేపట్టామన్నారు. దీనిలో అంబేద్కర్ జీవిత చరిత్రను ఆధునిక సాంకేతికతతో కళారూపాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 22న కర్నూలులో ప్రారంభమైన ప్రదర్శనలు ఈ నెల 18న విజయవాడలో ముగుస్తాయన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 17న జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలోని గునుపూడిలో పెద్దఎత్తున నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఈ నాటక ప్రదర్శనను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, శాసనమండలి సభ్యులు బొర్రా గోపీమూర్తి, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వరరావు, నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ తరపున అంబేద్కర్ బుద్ధిస్టు కెకె.రాజా విచ్చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, నాయకులు మూటూరి రాజశేఖర్, సైదు లక్ష్మణ్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరించిన నేతలు

నేడు, రేపు భారీ వర్షాలు

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

భీమవరం : జిల్లాకు ఈనెల 14, 15 తేదీల్లో భారీ వర్ష సూచన హెచ్చరికల నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అఖిల భారత వాతావరణ శాఖ మంగళవారం మధ్యాహ్నం 1:45 గంటలకు సూచనలు జారీ చేస్తూ బులెటిన్ విడుదల చేయడం జరిగిందన్నారు. ఐఎండి బులిటెన్ అనుసరించి కోస్తా ఆంధ్ర, రాయలసీమలో గంటకు 50-60 కి.మీల నుండి 70 కిమీ.ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలియజేశారు. 13-15 తేదీలలో కోస్తా ఆంధ్ర, యానం, రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారన్నారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు ఐఎండి, ఎపి ఎస్‌డిఎంఎ జారీ చేసిన సూచనల ప్రకారం ఎప్పటికప్పుడు అందిస్తున్న సమాచారాన్ని అనుసరించి ఎస్‌ఒపి ప్రకారం ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా రైతులను అప్రమత్తం చేయాలని, వర్షాలు తగ్గేవరకు కోసిన ధాన్యాన్ని సరైన భద్రతతో నిలువ చేసుకోవడం, ఇంకా కొయ్యని వాటిని రెండు రోజులు కోతలు వాయిదా వేసుకొనేలా రైతులకు సమాచారాన్ని అందించాలన్నారు. ఈదురుగాలుల సమయంలో ప్రజలెవ్వరూ బయట తిరగరాదని హెచ్చరించారు.

దళితులపై దాడులకు పాల్పడిన ఘనత జగన్‌ది

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో హోంమంత్రి వంగలపూడి అనిత

ప్రజాశక్తి - తణుకు

దళితులను లక్ష్యంగా చేసుకుని వారిపై దాడులకు పాల్పడిన ఘనత జగన్మోహన్‌రెడ్డి దని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం తణుకు నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో అనిత, మంతెన రామరాజు కలిసి పర్యటించి సుమారు రూ.4 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. తొలుత ఎంఎల్‌ఎ రాధాకృష్ణ కార్యాలయానికి వచ్చిన హోంమంత్రికి పోలీసు గౌరవ వందనంతో ఘనస్వాగతం పలికారు. ఇరగవరం మండలం కె.ఇల్లిందరపర్రులో అంబేద్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరించి అనంతరం అనిత మాట్లాడుతూ దళితుల ఓట్లతో గెలిచానని చెప్పుకున్న జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వారి పతనమే లక్ష్యంగా పనిచేశారన్నారు. దళితురాలిని అయిన తనపైనే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయించిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదని తెలిపారు. టిడిఆర్ బాండ్ల కుంభకోణంలో ఎన్నో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు నియోజకవర్గ ప్రజల నుండి ఛీత్కారాలు ఎదుర్కొన్నారని ఎద్దేవా చేశారు. స్వేచ్ఛ, సమానత్వం చూపించడానికి తానే ఒక మార్గదర్శిగా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి స్థాయిలో సామాన్యురాలి ఇంటికి వచ్చి అతిథ్యం స్వీకరించారని గుర్తు చేశారు. నాలాంటి సామాన్య ఉపాధ్యాయురాలు అసెంబ్లీకు వెళ్లిందంటే ఆనాడు బాబా సాహెబ్ అంబేద్కర్ పెట్టిన భిక్షగా భావించాలన్నారు. తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ఎక్కడకు వెళ్లినా ప్రజలు చూపిస్తున్న ఆదరణ కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. కె.ఇల్లిందరపర్రు గ్రామం టిడిపికి కంచుకోట అన్నారు. ప్రభుత్వం ద్వారా నియోజవర్గ ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ కూటమి నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అనిత, ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

మొగల్తూరు సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ

మొగల్తూరు: ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మొగల్తూరు గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.10 కోట్ల నిధులు మంజూరైనట్లు సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మొగల్తూరు పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాణ్ బాధ్యతలు చేపట్టడంతో వారు పుట్టి పెరిగిన గ్రామమైన మొగల్తూరును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. దీంతో పవన్ కళ్యాణ్ మొగల్తూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించి పంచాయితీ రాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజతో మొగల్తూరులో ఫిబ్రవరిలో వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారన్నారు. ఈ సమావేశంలో మొగల్తూరు అభివృద్ధికి అనేక ప్రతిపాదనలు అందాయన్నారు. గ్రామాభివృద్ధికి రూ.90 కోట్లతో ప్రతిపాదనలు అందించగా తొలివిడతగా రూ.10 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో చిరంజీవి విద్యనభ్యసించిన ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.1.71 కోట్లు, పాతకాలువ, గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతాల్లో బస్‌స్టాండ్ల మరమ్మత్తులకు రూ.12 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ఆయా పనులను తొందర్లోనే ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు, పొన్నపల్లి శ్రీలక్ష్మి మోహన్, కొందా ఆదాము, మద్దూరి పెద్దిరాజు, ముక్కు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు రక్తం, ఫిల్టర్ సెట్‌లు అందజేత

పాలకొల్లు : ప్రపంచ తలసేమియా డే సందర్భంగా బ్రాడీపేట బైపాస్ రోడ్‌లో ఉన్న ఆపద్బాంధు బ్లడ్ బ్యాంక్‌లో పలువురు తలసేమియా బాధితులకు ఉచితంగా రక్తం, అవసరమైన ఫిల్టర్ సెట్‌లను అందజేశారు. నర్సాపురం ప్రాంతానికి చెందిన డి.మేరీ, మల్లిపూడి గ్రామానికి చెందిన పాముల పూర్ణ సత్యసాయి వీరిరువురికి అవసరమైన రక్తాన్ని, ఫిల్టర్ సెట్‌లను ఆపద్బాంధు బ్లడ్ బ్యాంక్ ఈడుపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు, రూరల్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు సొలస సుబ్బారావు చేతులమీదుగా బాధితులకు అందచేశారు. ఈ సందర్భంగా తులా రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ఆపద్బాంధు బ్లడ్ బ్యాంక్ వారు సంవత్సరం నుండి 5 మంది తలసేమియా బాధితులను దత్తత తీసుకొని వారికి అవసరమైన రక్తాన్ని, ఫిల్టర్ సెట్‌ను ఎప్పటికప్పుడు అందజేయడం ఎంతో అభినందనీయమని, మంగళవారం బాధితులకు రక్తం ఇవ్వడానికి ముందు వచ్చిన మినిమించిలిపాడు గ్రామానికి చెందిన కె.చంద్రశేఖర్, మంగరాజులు గొప్ప మనసు చాటుకున్నారన్నారు. ఆపద్బాంధు బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు ఈడుపల్లి శ్రీధర్, కడలి సతీష్, రూరల్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



రోగులకు రక్తం ఫిల్టర్ సెట్‌లు అందిస్తున్న పలువురు

ప్రతి విద్యార్థిని ఉన్నతంగా తీర్చిదిద్దుతాం

శ్రీచింతలపాటి బాపిరాజు స్మారక ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తమ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థిని విద్యార్థి దశనుండే ఉన్నతమైన ఆలోచనలు చేపట్టే విధంగా, అలాగే భవిష్యత్తుకు మంచి బాటలు వేసే విధంగా తీర్చిదిద్దుతామని శ్రీచింతలపాటి బాపిరాజు స్మారక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన శనివారం ప్రజాశక్తితో కొన్ని విషయాలను పంచుకున్నారు. తమ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఎంతోమంది ఇప్పుడు డాక్టర్స్‌గా ఉన్నారన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి 62 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. సిహెచ్.తేజ నాగశ్రీ 519 స్కూల్ ఫస్ట్ సాధించిందన్నారు. బి.ప్రకాష్ 512 స్కూల్ సెకండ్ అన్నారు. బి.మోహన్ సాయి 450 మార్కులు సాధించి స్కూల్ థర్డ్ వచ్చాడని తెలిపారు. తమ స్కూలు విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని ఆయన తెలిపారు. ఈ స్కూలు డిఆర్ కళాశాల యాజమాన్యం సహకారంతో నడుస్తుందన్నారు. తమ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ బాగా రాణిస్తున్నారన్నారు. వచ్చే ఏడాది మరిన్ని మంచి ఫలితాలు సాధించేందుకు కృషిచేస్తామని ఆయన వివరించారు.


హెచ్ఎం శ్రీనివాసరావు


తేజ నాగశ్రీ స్కూల్ ఫస్ట్


జ్యోతి ప్రకాష్ స్కూల్ సెకండ్

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వ పాఠశాలల్లో లభించే మెరుగైన విద్య, మౌలిక వసతులు అందరు విద్యార్థులు పొందాలని పెనుమంట్ర విద్యాశాఖ ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఉదయం మండలంలోని సత్యవరం గ్రామంలోని ప్రజాప్రతినిధులు, స్థానిక ఉపాధ్యాయులతో కలిసి ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. సత్యవరం గ్రామంలో నడుస్తున్న మండల పరిషత్ యుపి పాఠశాల స్థానంలో 2025-26 విద్యా సంవత్సరం నుండి మోడల్ స్కూల్‌గా తరగతికి ఒక ఉపాధ్యాయునితో మార్చిందని ఎంఇఒ వెల్లడించారు. ఇంటింటికీ తిరిగి ప్రయివేట్ విద్యాసంస్థలకు వెళ్తున్న పలువురు పిల్లలను, వారి పేరెంట్స్‌తో మాట్లాడి స్థానిక ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ప్రవేశం కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి శ్రీనివాస్, వార్డు సభ్యులు, మోడల్ స్కూల్ హెచ్ఎం శ్రీనివాసుల రామకృష్ణ, ఉపాధ్యాయులు వి.జ్యోతి, ఆర్.రవి, పి.పార్వతి, సచివాలయం సిబ్బంది గాంధీ, టాని, అంగన్వాడీ వర్కర్ సూర్య కుమారి పాల్గొన్నారు.

వెంకటరత్నంకు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్(ఎపిజెయు) 5వ వార్షికోత్సవ సందర్భంగా మాజీ రాష్ట్రపతి జ్ఞాని జైల్‌సింగ్ నేషనల్ మెమోరియల్ అవార్డ్స్-2025 కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్న సేవామూర్తులను ఘనంగా సత్కరించి జాతీయ పురస్కారాలను నిర్వాహకులు అందజేశారు. స్థానికంగా సామాజిక, సాహితీ సాంస్కృతిక రంగాలలో ఆయా సంస్థల ద్వారా విశిష్ట సేవలు అందిస్తున్న శ్రీపుష్పరాజ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నంను ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిధులు, మైనారిటీ వ్యవహారాల సలహాదారులు, మాజీ శాసనమండలి అధ్యక్షులు ఎంఎ షరీఫ్ చేతుల మీదుగా సత్కరించి జాతీయ సేవా పురస్కారాన్ని అందజేశారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - పెనుమంట్ర

సమాజంలో బాలికలు వారి హక్కుల కోసం తెలుసుకోవడంతో పాటు పోక్సో చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ పెనుమంట్ర ప్రాజెక్ట్ సిడిపిఒ అంగర కృష్ణకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని ఆలమూరు, కొయ్యేటి పాడు గ్రామాల్లో కిశోరి బాలికల వేసవి శిక్షణ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. సెల్ ఫోన్ వాడకం తగ్గించాలని, వాటిలో విద్యా, విజ్ఞాన కార్యక్రమాలు మాత్రమే చూడాలని ఆమె హితవు పలికారు. ప్రాజెక్టు సూపర్‌వైజర్ బి.పోశమ్మ, వైద్య శాఖ ఎఎన్ఎంలు, అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

గణపవరం : చట్టాలపై 11-18 వయస్సుగల బాలబాలికలు అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సిడిపిఒ టిఎల్ సరస్వతి అన్నారు. మంగళవారం జల్లికొమ్మరలో జరిగిన కిశోర్ వికాసం కార్యక్రమంలో పాల్గొని బాలబాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గణపవరం సెక్టార్ సూపర్‌వైజర్ తులసి, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని వెలివర్రు, ఉండి గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలలో కిశోరీ వికాసం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం.పాతిమా, ఎఎన్ఎం అంగన్వాడీలు కుసుమ, శ్యామల, తవిటమ్మ, కనకమహాలక్ష్మి, చిన్నారులు వారి తల్లులు పాల్గొన్నారు.

బదిలీల జిఒలు విద్యావ్యవస్థకు తీవ్ర నష్టం

ఎస్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సాయి వర్మ

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయ బదిలీల సందర్భంగా ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన జిఒలు రాబోయే రోజుల్లో విద్యావ్యవస్థకే తీవ్ర నష్టం చేకూర్చనున్నాయని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుండా శ్రీనివాస్, పిఆర్‌ఎస్.సాయి వర్మ అన్నారు. స్థానిక ఎస్‌టియు భవనంలో ఎస్‌టియు జిల్లా కార్యవర్గ అంతర్గత సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో హిందీ, పిఈటీ పోస్టుల మిగులే 8 సెక్షన్లు ఒకటే బోధన మంజూరు చేశారన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కనీసం వారానికి 40 పీరియడ్లకు తక్కువ కాకుండా పనిచేయవలసి ఉంటుందన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలలో 140 మంది వరకు నెంబరుకు స్కూల్ అసిస్టెంట్ మాత్రమే ఉంటారన్నారు. సబ్జెక్టు టీచర్లు లేకుండా ప్రాథమికోన్నత పాఠశాలలలో బోధన అసాధ్యమన్నారు. బదిలీల ఉత్తర్వులు 117 జిఒ కంటే అధ్వాన్నంగా ఉన్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : కలెక్టర్

భీమవరం : జిల్లాలో ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కాంట్రాక్టర్లను, గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి పేదలకు నిర్మించి ఇచ్చే గృహాలలో ఆప్షన్ -3 క్యాటగిరికి సంబంధించి గృహనిర్మాణ పై కాంట్రాక్టర్లు, గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించారు. లబ్ధిదారులకు గృహ నిర్మాణం చేసుకోలేని వారికి ప్రభుత్వ ఇల్లు కట్టించి ఇచ్చేలా ఆప్షన్-3 క్యాటగిరిలో జిల్లాలో 6,960 గృహాలు చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ ఇళ్ల నిర్మాణం పనులు తీసుకున్న 49 మంది కాంట్రాక్టర్లకు గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చియ్య, ద్వారా పీడీ టిసి హెచ్.అప్పారావు, గృహనిర్మాణ శాఖ డిఇలు పాల్గొన్నారు.

కాలువ పూడిక తీత పనులు ప్రారంభం

నరసాపురం : మండలంలోని సీతారామపురం గ్రామంలో వంతెన దగ్గర కాలువ పూడిక తీత కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా డెల్టా వైస్ చైర్మన్ గుబ్బల మల్రాజు, ఇరిగేషన్ డిఇ సిహెచ్.వెంకట నారాయణ, ఆకన చంద్రశేఖర్, వాకాటి కనకరాజు, ఇంటి మురళీ, కొండేటి వెంకట పాల్గొన్నారు.

పంట కాలవ తవ్వకం పనుల పరిశీలన

పాలకొల్లు రూరల్ : గత వైసిపి ప్రభుత్వ పాలనలో రైతులను, వ్యవసాయాన్ని గాలికి వదిలేసారని, రైతుల గురించి ఎప్పుడూ నాయకులు మాట్లాడే అర్హత లేదని పాలకొల్లు మండల టిడిపి అధ్యక్షుడు కోడి విజయభాస్కర్ అన్నారు. ఆయన పాలకొల్లు మండలం అరటి కట్ల గ్రామంలో జరుగుతున్న రాపాక ఛానల్ పంట కాలవ తవ్వక పనులను కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. జరుగుతున్న పనులు పట్ల రైతాంగం సంతృప్తి వ్యక్తం చేసింది. గొబ్బుముక్కుల సూర్యనారాయణ రాజు, ఇంటి శ్రీరాములు, అందుకూరి వీరభద్ర, నెక్కంటి ఆది నారాయణ, అంగర చిన్న, చింతపల్లి శ్రీనివాస్, మల్ల సాంబ పాల్గొన్నారు.

16న సిజిఆర్ఎఫ్ సమావేశం

వీరవాసరం: ఈనెల 16న వీరవాసరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెసల్ ఫోరం(సిజిఆర్ఎఫ్) సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎఇ అప్పారావు మంగళవారం తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, మీటర్ లోపాలు, ఓల్టేజీ సమస్యలు, కొత్త కనెక్షన్లలో జాప్యం, సర్వీస్ లోపాలు, రీ కనెక్షన్ సమస్యలు, కాలిపోయిన మీటర్లు, కనెక్షన్ మార్పు, బిల్లుల్లో తప్పులు వంటి సమస్యలను సిజిఆర్ఎఫ్ కమిటీకి నేరుగా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. అత్యంత ప్రాధాన్యతగల ఈ సమావేశానికి వినియోగదారులందరూ పాల్గొనాలని ఎఇ కోరారు.

జన సైనికులకు అభినందన

పాలకొల్లు : జనసేన క్రియాశీలక సభ్యత్వం నమోదు చేసిన 64 మంది జనసేన క్రియాశీలక సభ్యులు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన వారి వాలంటీర్లు నమోదు చేయించిన సభ్యత్వం కిట్లను, అధ్యక్షుల వారి మనోగతం, కార్డులను అందజేశారు. పాలకొల్లు పట్టణం స్థానిక శ్రీనివాస డీలక్స్ థియేటర్ సమీపంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సభ్యత్వం చేసిన సభ్యునికి నేరుగా కార్డులు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో వెళ్లి తమని పార్టీ నేరుగా సభ్యత్వ కిట్లను అందజేయాలని ఆదేశించిన నేపథ్యంలో మంగళవారం పాలకొల్లు నియోజకవర్గంలో 9,405 సభ్యత్వాలను నమోదు చేసిన 64 మంది వాలంటీర్లకు కిట్లను అందజేశామన్నారు. క్రియాశీలక సభ్యుడు ఎవరైనా ప్రమాదంలో చనిపోతే సమాచారం వెంటనే అందించాలని, వారికి న్యాయం జరిగేలా అధ్యక్షుల నిరంతర పర్యవేక్షిస్తున్నారని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్లపల్లి రామలింగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు శిరగం సురేంద్ర, యలమంచిలి మండలం అధ్యక్షుడు కొడవలి వరలక్ష్మి, పోడూరు మండల అధ్యక్షుడు పితాని వెంకటేష్, జిల్లా సంయుక్త కార్యదర్శులు ఉన్నమట్ల ప్రేమ్ కుమార్, షేక్ వల్లి, దేగల సత్తిరాజు, సింహకోట గోపి, పినిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్ణచైతన్యకు పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శిగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - మొగల్తూరు



మొగల్తూరు పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అనిశెట్టి పూర్ణచైతన్యకు పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శిగా ఉద్యోగోన్నతి వచ్చింది. ఈ సందర్భంగా చైతన్యను నరసాపురం గ్రామీణ మండలం తూర్పు తాళ్లు పంచాయతీ కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ సందర్భంగా చైతన్యను మొగల్తూరు పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, సర్పంచి మేరీ సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు మంగళవారం అభినందించారు.

విప్ నాయకర్‌ను కలిసిన పెద్దిరాజు

నరసాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకారుల, సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్‌గా ఎన్నికైన నరసాపురం పట్టణానికి చెందిన కొల్లు పెద్దిరాజు రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌ని మంగళవారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా విప్ నాయకర్ కొల్లు పెద్దిరాజుకు అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్ పదవి కొల్లు పెద్దిరాజుకి దక్కడం అభినందనీయమని అన్నారు. అందరూ కలిసికట్టుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడపడానికి తమ వంతు కృషిచేయాలని అన్నారు. అనంతరం పెద్దిరాజు శాలువాతో ఎంఎల్ఎ నాయకర్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొప్పాడ నరేష్, సంగాని రాజు, పోతబత్తుల శ్రీను, మల్లాడి శ్రీను, మల్లాడి బాలు, కొప్పాడ అనంత, పెమ్మాడి కిరణ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందన

భీమవరం : రెడ్‌క్రాస్ సేవలకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఇటీవల రెడ్ క్రాస్ గోల్డ్ మెడల్ అందుకున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని స్థానిక కలెక్టరేట్లో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల లక్ష్మీనారాయణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జకరయ్యలు సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా గ్రామ, రెవెన్యూ అధికారులు అందరూ కష్టపడి జిల్లాకి మంచిపేరు తీసుకురావాలని కోరారు. జిల్లా అధ్యక్షులు రవీంద్ర రాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ స్ఫూర్తితో జిల్లా గ్రామ రెవెన్యూ అధికారులు అందరూ కష్టపడి జిల్లాకి మంచిపేరు తీసుకొస్తామన్నారు. భీమవరం డివిజన్ అధ్యక్షులు కెనడి, నరసాపురం డివిజన్ అధ్యక్షులు సత్తిబాబు, అత్తిలి మండల విఆర్ఒలు రామకృష్ణ, గోపికృష్ణ కుమార్ భీమవరం వీఆర్ఒలు ప్రజ్యోతన, పార్వతి, విజయ, కిరణ్మయి, సుధారాణి పాల్గొన్నారు.

నేడు డిఎస్‌సి కోచింగ్ ముగింపు సభ

పాలకొల్లు : పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 110 రోజులపాటు దిగ్విజయంగా నిర్వహించిన ఉచిత డిఎస్‌సి కోచింగ్ ముగుస్తోంది. సిలబస్ పూర్తి అయిన సందర్భంగా బిఆర్ఎంవి మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడాస్థల ప్రాంగణంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు మంత్రి నిమ్మల రామానాయుడు సారథ్యంలో ముగింపు సభ ఏర్పాటు చేశారు. ఈ ముగింపు సభలో అభ్యర్థులతో పాటు వారి తల్లిదండ్రులు హాజరవుతారు. కోచింగ్ ఇచ్చిన 81 మంది అధ్యాపకులను మంత్రి ఆధ్వర్యంలో సత్కరిస్తున్నారు.

'మాతృభాషతో పాటు ఇంగ్లీష్ నేర్చుకోవాలి'

పెనుమంట్ర : విద్యార్థులు మాతృ భాషతో పాటు ఇంగ్లీష్ భాష నేర్చుకోవడం వల్ల ప్రగతి సాధ్యమని విశ్రాంత టీచర్ పి.సువర్ణగౌరి అన్నారు. మంగళవారం మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరం స్పోకెన్ ఇంగ్లీష్‌లో సులువైన విధానం గురించి వివరించారు. రిటైర్డ్ తహశీల్దార్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి పిల్లలకు గీత శ్లోకాలు నేర్పించారు. గ్రంథాలయ మాస్టర్ పిటిఎస్.కుమార్ పిల్లల చేత గ్రంథాలయంలో పుస్తకాలు, స్టోరి బుక్స్ చదివించారు. ఈరోజు వేసవి శిక్షణా శిబిరంలో బి.హాసిని, ఎస్.జశ్వంతి, ఎం.సౌజన్య, సిహెచ్.వంశీ, వై.యోగామృత్, పి.శ్రీ భవిష్య, ఎస్.తనుష్క, బి.నిహిత, కె.శ్రావ్య, డి.సూర్య, ఎం.కౌశిక్, పి.లోకేష్, కె.చంద్రిక, సహాయకులు రామిరెడ్డి పాల్గొన్నారు.

34,750 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

పెనుమంట్ర : మండలంలో దాళ్వా 2024-25 సీజన్‌కి గాను 16 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి 34,750 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి అడబాల జ్యోషిలా తెలిపారు. మంగళవారం కార్యాలయంలో మాట్లాడుతూ నేటి వరకు మొత్తం కొనుగోలు చేయవల్సిన ధాన్యం టార్గెట్ ను చేరుకున్నామని తెలిపారు.

అండర్-19 చదరంగం పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నరసాపురం


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ నాయకర్

8వ నూలిసాయి అభయ్ మెమోరియల్ ఎపి స్టేట్ అండర్-19 ఓపెన్ అండ్ గర్ల్స్ చదరంగం పోటీలు స్థానిక హైవే ఇన్ ఎసి హాల్లో ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని నిర్వాహకులు నూలి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం టోర్నమెంట్ బ్రోచర్‌ని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ జనసేన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. బిజిబిఎస్ ఉమెన్స్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ నూలి శ్రీనివాస్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నూలి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తన కుమారుడు పేరిట రూ.64 వేల నగదు బహుమతితో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఇది ఎనిమిదవ సంవత్సరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ చెస్ అకాడమీ సెక్రటరీ ఎస్ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మొత్తం ఈ పోటీలకి అన్ని జిల్లాల నుంచి సుమారు 400 మంది చిన్నారులు పాల్గొంటున్నారన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరూ 19 సంవత్సరాల లోపు బాలబాలికలై ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు జక్కం బాబ్జి పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 9440867370 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

డిసిఎంఎస్ ఛైర్మన్ మురళీకృష్ణను కలిసిన పోలిశెట్టి


చాగంటి చిన్నకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పోలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - నరసాపురం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ(చిన్న)కు శుభాకాంక్షలు తెలిపేందుకు అభిమానులు పోటెత్తుతున్నారు. ఈ సందర్భంగా మండలంలోని నవరసపురం గ్రామంలోని చాగంటి చిన్న కార్యాలయంలో మంగళవారం చిన్నను జనసేన సీనియర్ నాయకుడు పోలిశెట్టి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మురళీకృష్ణ జనసేన బలోపేతానికి ఎనలేని కృషిచేశారని తెలిపారు. వారి శ్రమకు గుర్తింపు లభించడం శుభపరిణామమని శ్రీనివాస్ కొనియాడారు. పార్టీకి వెన్నుముఖగా నిలిచిన చాగంటి చిన్నకు అధినేత పవన్ సముచిత స్థానాన్ని కల్పించడం హర్షణీయమన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి జనసేనను నమ్ముకోవడమే గాకుండా పార్టీకి అన్ని విధాలుగా అండగా ఉన్న చిన్నను త్వరితగతిన గుర్తించి డిసిఎంఎస్ ఛైర్మన్‌గా నియమించడం ఆనందంగా ఉందని తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులు దక్కాలని ఆకాంక్షించారు. కూటమి నేతలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వీర మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, శాలువాలు కప్పి, పూలదండలు వేసి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

నేపాల్ దేవ్ భట్టాచార్య మృతి బాధాకరం

సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

నేపాల్ దేవ్ భట్టాచార్య మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారనే వార్త మనందరినీ విషాదంలో నెట్టేసిందని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అన్నారు. ఆలిండియా రోడ్డు ట్రాన్సుపోర్టు వర్కర్స్ ఫెడరేషన్ అఖిల భారత అధ్యక్షులు నేపాల్ దేవ్ భట్టాచార్య సంతాప సభ తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముందుగా నేపాల్ దేవ్ భట్టాచార్య చిత్రపటానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంతాప సభకు సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ నేపాల్ దేవ్ భట్టాచార్య జీవితాంతం శ్రామికవర్గ విప్లవం కోసం, సమ సమాజమైన సోషలిస్టు వ్యవస్థ సాధనకు తన జీవితం అంకితం చేశారని తెలిపారు. బెంగాల్ కార్మిక ఉద్యమ నాయకులుగా, పార్లమెంట్ సభ్యునిగా నిరంతరం ప్రజలకు, కార్మికులకు ముందుండి నడిపారని ఆయన అన్నారు. వారికి తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ సంతాపం ప్రకటించిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, పబ్బాని సురేష్, అల్లిగి వేణు, యడవల్లి వెంకట దుర్గారావు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ఉండి : గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి, స్థానిక ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. మంగళవారం ఉండి మండలం ఉనుదుర్రు గ్రామంలో సుమారు 50 లక్షల వ్యయంతో నిర్మించిన పంపు హౌస్, వాటర్ ప్లాంట్, ముత్యాలమ్మ ఆలయం వద్ద సీసీ రహదారి, కమ్యూనిటీ హాల్, హెల్త్ సెంటర్ లను సతీసమేతంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో మే 13 చారిత్రాత్మకమైనదని, సైకో పాలనను ప్రజలు అంతమొందించిన రోజని, అదేరోజు ఉనుదుర్రు గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. నీటి కాలుష్య సమస్య పరిష్కారానికి ప్రజలంతా ముందుకు రావాలని ఆయన కోరారు. మే 14, 2021న పుట్టినరోజు సందర్భంగా గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్యాయంగా అరెస్టు చేసి కొట్టించాడని బుధవారం దానిని పురస్కరించుకుని ప్రతీకార దినోత్సవం నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఆ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు. అనంతరం ఎంఎల్ఎ దంపతులను ప్రజాప్రతినిధులు, నాయకులు, దాతలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి, ఎఎంసి ఛైర్మన్ జుత్తిగ నాగరాజు, కనుమూరి భరత్, గ్రామ సర్పంచి పిన్నంరాజు నాగలక్ష్మి, ఎంపిటిసి అల్లూరి మాధవి, టిడిపి గ్రామ అధ్యక్షుడు బండారు వీర రాఘవులు, బండారు సాయి, మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు పాల్గొన్నారు.

20న సమ్మెను జయప్రదం చేయాలి

పెంటపాడు : ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పనులు చూపించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఏడవ రోజు మండలంలోని యానాలపల్లి, మౌంజిపాడు, విప్పర్రు గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం పరిరక్షణ యాత్ర నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు పెంటపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన యాత్రలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మరపట్ల దానయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు పని ప్రదేశాలకు వెళ్లి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి చట్టం రక్షణ కోసం మనం ఒకరోజు ఈనెల 20న ఉపాధి పనులు బంద్ చేద్దామని పిలుపునిచ్చారు. పెనగంటి దుర్గ, పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: మెట్ట ఉప్పరగూడెం పని ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని, 40 డిగ్రీల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, టెంట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని, మజ్జిగ, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధి కూలీలు, మేట్లు మాట్లాడారు.

అత్తిలి : ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించబోయే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ కూలీలకు పిలుపునిచ్చారు. అత్తిలి మండలం వరిగేడు గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పితాని దానేశ్వరరావు, బొక్క శ్రీను, బాలం చంద్రకళ, జోగి శ్రీనివాసు, కట్టా కుమారి, బాలం తులసమ్మ, జోగి సింహాచలం, పెచ్చెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరు : 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని అసంఘటిత కార్మికులకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మొగల్తూరులోని సిపిఎం కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్లతో కార్మికులకు జరిగే అన్యాయాన్ని వివరిస్తూ ముద్రించిన పుస్తకాన్ని మంగళవారం అంగన్వాడీలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పి.బేబీ కుమారి, ఆర్.మోర్తా, పి.సత్యవతి, కె.రమాదేవి, ఎం.సరోజినీ, పి.ప్రసన్న, పి.మరియమ్మ, వి.సువర్ణ, ఎం.జ్యోతి, వరలక్ష్మి ఉన్నారు.

తణుకు : కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ రద్దు వెనక్కి తీసుకొనే వరకు పోరాటం ఆగదని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో హమాలీ కార్మికులతో సమ్మె పోస్టర్‌ని ఆవిష్కరించారు. అనంతరం సమ్మె నోటీసు సివిల్ సప్లై ఇన్‌ఛార్జి సుబ్రహ్మణ్యంకి అందజేశారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, కుడిపూడి రాము, నర్సింహమూర్తి, ఎస్.రాజు, టి.అప్పన్న, గోవింద్, సుధాకర్ పాల్గొన్నారు.

ఉండి : ఈనెల 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఒక రోజు సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఉండి మండలం మహదేవపట్నంలోని ఎపి బేవరేజెస్ గోడౌన్ వద్ద సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బేవరేజెస్ హమాలీలు పాల్గొన్నారు.

నరసాపురం: మండలంలోని స్థానిక చిట్టవరం గ్రామంలో భారత్ లక్ష్మీ నడా ఆగ్రో ఫీడ్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. 20న సమ్మెను జయప్రదం చేయాలని విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. సిఐటియు నాయకులు కోడి లక్ష్మణ్, కొరాడి బద్రి, హరి, గంగాధర్ పెద్దిరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.